# మాదీ స్వతంత్ర దేశం...

"మాదీ స్వతంత్ర జాతీ, భరతదేశమే మా దేశం..." పాత పాట. సుమధురంగా వినిపిస్తోంది. టంగుటూరి సూర్యకుమారి మరణవార్త వినగానే చెవుల్లో గింగురు మన్నవి ఆమె పాడిన పాటలే. స్వాతంత్ర్యం వచ్చాక, కనీసం పది పదిహేనేళ్లయినా ఈ పాటలు అన్ని వేదికలమీదా, అన్ని సమావేశాలలో వినిపిస్తూ వుండేవి.

ఇప్పటికీ అనిపిస్తూ వుంటుంది, ఆ రోజుల్లో విద్యార్థులుగా వుండటమే గొప్ప వరమని. అన్ని స్కూళ్ళలో దేశభక్తి పాటలు నేర్పేవారు. పిల్లలందరూ లేత గొంతులతో కలిసి పాడుతుంటే, పాడే వాళ్ళకు, వినేవాళ్లకు ఒళ్లు పులకరించేది.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా...'

సూర్యకుమారి గొంతులో ఆ పాట ఆర్తిగా పలుకుతోంది. ఆమె మీద వున్న ప్రేమకొద్దీ... నా బాల్యం మళ్ళీ జీవించాలనే ఆశతో తెలిసినవారి నెవరినో బతిమాలి, బామాలి ఈ క్యాసెట్టు ఆంధ్రప్రదేశ్ నుండి తెప్పించాను.

"జాతులు మతములన్నీ
అన్నదమ్ములవలె మెలగవలెనోయ్...'

సూర్యకుమారి గురజాడ మాటల్లో అనునయించి చెపుతోంది. ఎన్నో దేశభక్తి పాటలు! స్కూళ్ళలో ప్రార్థనా సమావేశాల్లో విధిగా దేశభక్తి పాట ఒకటి వుండేది. "కులాలు లేవు, మతాలు లేవు, మనమందరం భారతీయులం. మనమందరం అన్నదమ్ములం."

ఇంచుమించు అరవైలవరకు ఇదే ధోరణి. అప్పుడు పెరిగిన ఆ తరం, విద్య నేర్చుకొన్న ఆ తరం 'వందేమాతరం' గీతం విన్నా, 'జనగణమన' విన్నా ఆ క్షణమే శాశ్వత మన్నంతగా లీనమయిపోయేవారు. దేశసమైక్యత, భావసమైక్యత చర్చనీయాంశాలుగా వుండేవి.

అదో పిచ్చి ప్రపంచం. అదో పిచ్చి ఆదర్శం. అంతా మంచే జరుగుతుందన్న ఊహ. ఎవరికీ అన్యాయం జరగదనే ఆశ. 'సమ సమాజం', 'సంక్షేమ రాజ్యం' - అని మేధావులు పలికేవారు. ఎక్కడో అపశ్రుతి... అప్పుడే 'బజ్' మంటూ బెల్ మోగింది. తలుపుతీశాను. ఎదురుగా కొంచెం పొట్టిగా, బొద్దుగా కళ్ళజోడుతో ఒక వ్యక్తి దర్శనమిచ్చాడు. నోరంతా తెరిచి నవ్వాడు. పళ్ళు తెల్లగా మెరిశాయి.

"నమస్కారం" అన్నాడు.

"నమస్కారం" అన్నాను.

"మీరు నన్ను గుర్తుపట్టలేదు సార్."

నేను బదులుగా చిరునవ్వు నవ్వాను. నిజంగానే అతనిని గుర్తుపట్టలేదు మరి.

"లోపలికి రండి" అన్నాను, తలుపు బాగా తెరిచి.

"అదేమిటిసార్ నన్ను 'మీరు' అని మన్నిస్తారు" అన్నాడతను. "కూర్చోండి" అన్నాను.

"భలేవారే సార్. మీరు కూర్చోకుండా నేను కూర్చోవటమే!" అన్నాడతను.

"అటువంటివేమీ పెట్టుకోకండి. కూర్చోండి."

"నాకు తెలుసు సార్. మీరు నన్ను గుర్తుపట్టలేదు. అందుకే 'మీరు', 'మీరు' అంటున్నారు. ఈ ఊరి పేరు వింటే మొదట జ్ఞాపకమొచ్చేది మీరే. ఇన్నేళ్ళకు ఈ ఊరికి వచ్చే అవకాశమొచ్చింది. అందుకే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను". అతని కళ్ళలో ఒక విధమైన ఆరాధనాభావం, పెదవులపై నవ్వు.

"మస్తాన్... మస్తాన్ రెడ్డీ?"

"అవును సార్. మీకు జ్ఞాపకమున్నానా?"

"ప్రపంచంలో నాకున్న శిష్యులు మీ క్లాస్‌మేట్సే కదా! ఆ ఒక్క సంవత్సరమే నేను టెంపరరీ లెక్చరరుగా పనిచేసింది" అన్నాను, ఆనందాన్ని, జ్ఞాపకాలను అదుపులో పెట్టుకుంటూ.

"ఇరవై ఏడేళ్లనాటి మాట సార్. మీరు సెంట్రల్ గవర్నమెంటుకు వచ్చేశారు. తర్వాత మీతో మాటా పలుకూ లేదు. దూరభారం కదా! మా ఊరికి మళ్ళీ ఎప్పుడయినా వచ్చారా సార్?"

"రెండు మూడు సార్లు వచ్చి వుంటాను. అదీ ఏదో పనిమీద. సెంట్రల్ గవర్నమెంటు నడుపుతున్న కొన్ని ప్రాజెక్టులున్నాయి కదా! అవి చూడటానికని..." మంచినీళ్లు, ఆరెంజిజ్యూస్, బిస్కెట్లు, ట్రేలో పట్టుకొచ్చి అతనికి దగ్గరగా పెట్టాను.

"ఇంట్లో ఎవరూ లేరా సార్?" అన్నాడతను చుట్టూ కలయజూస్తూ.

నాకు నవ్వు వచ్చింది. ఇంటికి వచ్చిన అతిథులకు ఆతిథ్యం స్త్రీలే చెయ్యాలనే నియమమేమీ లేదు. మా ఇంట్లో ఆ పట్టింపులేమీ లేవు. కానీ అతని ప్రశ్నకు

సమాధానమిస్తూ "లేరు. అందరూ వాళ్ళ వాళ్ళ పనులమీద వెళ్ళారు. ఏ మధ్యాహ్నమో, సాయంత్రమో వస్తారు" అన్నాను.

"ఆదివారం కూడా పనులేనా?" అంటూ అతను ఆశ్చర్యపోయాడు.

"పనులకు ఆదివారాలు, సోమవారాలు ఉంటాయేమిటి? పనిచేసేవాళ్ళకు ఏ రోజైనా ఒకటే."

"నిజమేలెండి. మీ సంగతి మొదటినుంచీ తెలిసిందే కదా. మీ ఫ్యామిలీ..."

నేను నవ్వాను. "మా ఆవిడ పేరు మేరీ. తనది బీహారు" అని చెప్పాను.

"అంటే..." ప్రశ్నార్థకంగా అడిగాడు.

"అవును క్రిస్టియన్. ఆదివాసీ క్రిస్టియన్. నాలాగే సెంట్రల్ సర్వీసెస్‌లో వుంది. ముస్సోరిలో ట్రైనింగులో వుండగా పరిచయం. తరువాత పెళ్ళి, పిల్లలు వినీత, కల్యాణ్. వినీత బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేస్తోంది. కల్యాణ్ ఇప్పుడే కాలేజీలో చేరాడు."

"బాగుంది సార్. చాలా బాగుంది. ఆ రోజుల్లో మీరంటే మా అందరికీ చాలా అభిమానం, ఆరాధన. మద్రాసు యూనివర్సిటీలో ఇంగ్లీషు లిటరేచరు ఫస్ట్ క్లాసులో పాసయ్యారని, పోటీ పరీక్షలకు చదువుతున్నారని, అదొక అద్భుతంగా చెప్పుకొనేవాళ్లం. అప్పుడు పోటీ పరీక్షలని కూడా తెలీదు. మా భాషలో అది 'ఐ.ఏ.ఎస్.' పరీక్ష. మీరున్నది ఒక ఏడాదే అయినా మా అందరికీ జ్ఞాపకమున్నారు. మిమ్మల్ని ఎప్పటికీ మరచిపోలేము."

"థాంక్స్, ఇదంతా మీ అభిమానమే. మీతో కలిసి తిరిగిన రోజులు నేనూ మరచిపోలేను. కాలేజీ స్పోర్ట్స్, నాటకాలు, డిబేట్లు, పిక్‌నిక్‌లు... అదో ఆనందం. ఇంకేమిటి మస్తాన్. నీ కుటుంబ విషయాలేమైనా చెప్పు" అన్నాను.

"నా కుటుంబం బాగానే వుంది సార్... ఇద్దరు పిల్లలు... సుజాత, సుశీల. ఇద్దరూ స్కూల్లో చదువుతున్నారు. భార్య లలిత. స్కూలు టీచరు."

"నువ్వేం చేస్తున్నావు?"

"రాజకీయాలు" అన్నాడు నవ్వుతూ.

"నిజంగానా?" అడిగాను.

"నిజమే సార్. నేను పార్టీ వర్కరును. మా ఊరి లెవల్లో పార్టీలో నా పేరు చెప్పుకొంటారు. సమావేశాలు, సమ్మెలు, సత్కారాలు అన్నీ ఏర్పాటు చేస్తుంటాను. ఇక ఎన్నికలప్పుడైతే చెప్పనక్కర్లేదు. ఊళ్లో మనకు మంచి పలుకుబడి వుంది సార్. ఒకసారి మన ఊరికి రండి. ఎటువంటి సభ ఏర్పాటు చేస్తానో చూద్దురుగాని" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. లోపలి గదిలో నుండి "మ్రోయింపు జయభేరీ, వాయింపుము నగారా" అని సన్నగా సూర్యకుమారి పాట వినిపిస్తోంది.

"ఏవో చాలా పాతకాలం పాటలు పెట్టుకొన్నారేం" అన్నాడతను. ఇంతలో కరెంటు పోయింది. పాట ఠక్కున ఆగిపోయింది.

"మీకూ వుందా కరెంటు పోవటాలు" అన్నాడు.

"మాకు అంటే... మేమేమైనా ప్రత్యేకంగా దిగి వచ్చామా? నీళ్ళ కొరత, విద్యుచ్ఛక్తి కొరత దేశమంతా వున్నట్టే ఇక్కడా వుంటుంది."

"ఈ ఫ్యాన్ మాత్రం తిరుగుతోందేం సార్" అన్నాడు. "ఇది ఇన్వర్టరులే" అన్నాను.

"అవునులెండి. ఇప్పుడందరూ ఇన్వర్టర్లు పెట్టుకొంటున్నారు." ఈ మాటా, ఆ మాటా మాట్లాడుకొన్నాం. మస్తాన్‌రెడ్డి మాటలు, ఆ వాక్చాతుర్యం నన్ను అబ్బురపరుస్తున్నాయి. ఎంత ఎదిగిపోయాడు! నేనెన్నడూ కలలో కూడా ఊహించని విషయాలు మాట్లాడుతున్నాడు.

వాళ్ళ ఊళ్ళో, చుట్టుపక్కల పల్లెల్లో ఏ కులాల వారికి ఎన్ని ఓట్లున్నదీ చెపుతున్నాడు. ఒకప్పుడు కులాల గురించి అడగటం, వాటి గురించి ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా మాట్లాడటం సభ్యత కాదనుకొనేవాళ్ళం. కులాల పేర్లతో ఉన్న వీధుల పేర్లు మార్చి ఏ నాయకుల పేర్లో పెట్టుకొనేవారు.

ఇప్పుడు ఇతనేమో, అందరి కులాలు పేరు పేరునా చెపుతూ, బి.సిలు, ఓ.సిలు అంటూ మాట్లాడేస్తున్నాడు. ఎవరికి ఎన్ని రిజర్వేషన్లు, ఏ ఆఫీసులో ఏ కులాలవాళ్ళు ఎంతమంది వున్నారు. వాళ్ళకు ఏఏ సంఘాలున్నాయి. వాళ్ళ డిమాండ్లు ఏమిటి ఏకరువు పెట్టేస్తున్నాడు.

అతని ధోరణిని అడ్డుకొంటూ, "కాలేజీ ఎలా వుంది? బాగా మారిందా? బాగా పెరిగిందా? డిపార్టుమెంట్లు చాలా పెరిగాయా?" అని అడిగాను.

"అబ్బా చాలా పెరిగిపోయింది సార్. పొద్దున, సాయంత్రం రెండు బ్యాచీలుగా వున్నారు స్టూడెంట్లు" అని చెప్పాడతను.

"మరి లెక్చరర్లు...?"

"వాళ్ళూ ఎక్కువగానే వున్నారు. కానీ, కాలేజీలో చదువు బాగా చెప్పరు సార్."

"అదేమిటి?" ప్రశ్నించాను నేను.

"అంతేసార్. కాలేజీ లెక్చరర్లు అందరూ కలిసి ఒక ప్రైవేటు స్టడీ సెంటరులాంటిది పెట్టారు. అక్కడే శ్రద్ధగా చెపుతారు. నోట్సులిస్తారు. అక్కడ ఫీజులు

కూడా ఎక్కువే. ఐతే అందరూ పాసవుతారు. కొందరికి క్లాసులు కూడా వస్తాయి. ఇంగ్లీషు బాగా నేర్పిస్తారు. కాలేజీలోలా అక్కడా గ్రూపులే."

"అంటే..." ప్రశ్నార్థకంగా అడిగాడు.

"పైకి అనరుగాని, అందరూ తమ కులాలను బట్టి దగ్గరవుతుంటారు."

"ఛీ" అప్రయత్నంగా నా నోట్లోనుండి వచ్చింది.

మస్తాన్‌రెడ్డి పళ్ళన్నీ కనిపించేలా నవ్వాడు. అతని నవ్వే అంత. ఎలెక్ట్రిక్ బల్బు వెలిగినట్టుంటుంది.

"ఛీత్కరిస్తే ఎలాసార్. ఈ కాలమే అంత. ఏదో ఒక గ్రూపు ఏర్పరచుకోవలసిందే. కులం కానివ్వండి, ప్రాంతం కానివ్వండి. రాజకీయాలే అంత. నిత్యజీవితమూ అంతే" అన్నాడు.

"మేము విద్యార్థులుగా వున్నప్పుడు రాజకీయాలకు మమ్మల్ని దూరంగా వుండమని హెచ్చరించే వారు మస్తాన్‌రెడ్డీ. చదువులో శ్రద్ధ చూపమనేవారు."

"మీరూ మాకు అలాగే చెప్పారు. మీకు తెలుసో తెలీదో కానీ అప్పటికే శంకరరెడ్డి మాస్టారు, రాజు మాస్టారు, కిష్టప్ప అయ్యవారు, మాధవరావు సారు, మమ్మల్ని గ్రూపులుగా చేరదీస్తుండేవారు."

నాకు తెలియదన్నట్టు తల ఊపుతూ "రాజకీయాలతోనే నీకు గడచిపోతుందనుకొంటాను. తీరికా లేకపోవచ్చు. ఇంటి భారమంతా భార్యమీదే వేశావా?" అన్నాను నవ్వుతూ.

"అదేం లేదు సార్. పనినిబట్టి సర్దుకుపోవలసిందే. నేనూ ఒక ఎన్.జి.ఓ. సంస్థ నడుపుతున్నాను. ఆ విషయమై కొన్ని ఫండ్సు కోసం ఈ ఊరు వచ్చాను. చాలా మినిస్ట్రీలు, ఎన్.జి.ఓలకు డబ్బు కేటాయిస్తాయి కదా!"

అవునని తల ఊపాను.

"నాకు కావలసిన సమాచారం దొరికింది సార్. ఇంకా ఒకరినిద్దరిని కలవాలి. నాకు ఫండ్స్ దొరుకుతాయని నమ్మకముంది సార్. మాది ఉత్తుత్తి సంఘం కాదులెండి. నిజంగానే పని జరుగుతోంది."

"మంచిదే కదా! అలాగే వుండాలి. చేసే పని చిత్తశుద్ధితో చేయాల్సిందే. ఇంకేమిటి విశేషాలు?"

"మీరేమో దూరంగా ఉండిపోయారు. మీ కలల ప్రపంచంలో మీరున్నారు. దేశభక్తి గేయాలు వింటున్నారు. ఇవన్నీ అవుట్ ఆఫ్ ఫ్యాషన్ సార్. స్వాతంత్ర్య దినోత్సవం లేదా రిపబ్లిక్ డే జరిగినపుడు నాయకులేదో 'శాంతి సామరస్యాలు',

'సౌభ్రాతృత్వం' అంటూ ఉపన్యాసాలు ఇస్తూ ఉంటారు. మాలాంటివాళ్ళం గుంపులమధ్య నిలబడి చప్పట్లు కొట్టిస్తుంటాం."

"మస్తాన్‌రెడ్డీ నీ వయసెంత?"

"నలభై ఏడు సార్."

"నా వయసెంత?"

"తెలీదుసార్. నాకంటె ఏడెనిమిది సంవత్సరాలు ఎక్కువగా వుండొచ్చు."

"ఇంత మాత్రానికే మన ప్రపంచాలు ఇంతగా విడిపోవాలా?" అడిగాను నేను.

"చెప్పాను కదా సార్. మీరు స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో ఆ ఉత్సాహంతో చదువుకొన్నారు. మేము చదువుకొనే రోజులకి మరెన్నో కొత్త విషయాలు చోటు చేసుకున్నాయి. మేము గ్రౌండు లెవల్లో రాజకీయాల్లో వున్నవాళ్లం. అవి రోజు రోజుకూ ఎంత క్లిష్టమవుతున్నాయో! మాకు వున్న అవగాహన మీకు రావాలంటే కష్టం. క్షమించాలి. ఈ మాట అహంకారంతో అన్నది కాదు."

నాకు అర్థమవుతోంద‌న్నట్టు తల ఊపాను.

మస్తాన్‌రెడ్డి చెప్పుకుపోతున్నాడు.

"మనం నాయకులు కావాలనుకుంటే, పలుకుబడి కావాలనుకుంటే భావోద్రేకాల్ని రెచ్చగొట్టాలి. ప్రజల హృదయానికి దగ్గరగా ఉన్న విషయాన్ని తాకాలి. అది సాధిస్తామని వారికి ఆశ కల్పించాలి. నిత్యమూ ఏదో ఒక లక్ష్యం చూపిస్తూండాలి. దేని కోసమో వెర్రిగా పరుగులు పెడ్తూనే వుండాలి."

"ఎందుకంత అసంతృప్తి?"

"అసంతృప్తి లేనిదెక్కడ సార్. దానినే లాభంగా మార్చాలి. ఏ రంగంలోనైనా చూడండి... వ్యాపారాలు, అడ్వర్టయిజుమెంట్లు... మన అసంతృప్తే వాళ్ళకు పెట్టుబడి." నేను మౌనంగా వింటూనే వున్నాను. మస్తాన్‌రెడ్డి చెపుతూనే వున్నాడు.

"రాజకీయాలూ అంతే. కులం కానివ్వండి, మతం కానివ్వండి, ప్రాంతం కానివ్వండి, భాష కానివ్వండి ప్రజలను ఆకట్టుకోవాలంటే 'అదిగో తోక' అని మభ్యపెట్టాల్సిందే. అంతే, వేట ప్రారంభమైపోతుంది" మస్తాన్‌రెడ్డి నవ్వాడు.

అతని మాటలు వింటుంటే ఏదో మబ్బుతెర తొలగినట్లే వుంది. లేక కమ్ముకొంటోందా?

"సరేలే. ఇప్పుడు ఏ తోకను చూపిస్తున్నావేమిటి?" అని అడిగాను.

"మా ఊరు హెడ్‌క్వార్టర్స్‌గా ప్రత్యేకమైన జిల్లా కావాలనుకొంటున్నాం. త్వరలో ఆందోళన ప్రారంభిస్తున్నాం" అని చెప్పాడు మస్తాన్‌రెడ్డి.

"ఆందోళనెందుకు? ప్రజాస్వామ్యంలో ఒక తీరూ తెన్నూ లేదా?" అని అడిగాను.

"అటువంటి ఆశలు మాకు లేవుసార్. ఎవరి మాటలు ఎవరు వింటారు. వీథులెక్కాల్సిందే. అందరికంటే మనగొంతు గట్టిగా వుండాల్సిందే."

"ప్రపంచమంతా సమాఖ్యలంటూ వివిధ దేశాలన్నీ ఒక్కటై, గ్రూపులుగా ఏర్పడుతున్నాయి. దలైలామా కూడా, టిబెట్టు తన సంస్కృతిని నిలుపుకొంటూ, చైనాలో భాగమైనా పర్వాలేదంటున్నారు. దేశాలు సమైక్యతవైపు మొగ్గుతుంటే, నువ్వు ముక్కలు ముక్కలుగా ఆలోచిస్తున్నావేమిటి?"

మస్తాన్‌రెడ్డి మళ్ళీ నవ్వాడు. "మీరు భిన్నత్వంలో ఏకత్వమన్నారు. మేము ఏకత్వంలో భిన్నత్వమంటున్నాం. అంతే తేడా."

"మస్తాన్‌రెడ్డీ, నిజంగానే నువ్వు నా గురువువయ్యా" అన్నాను నేను.

"అలా అనకండి సార్. పాఠాలు చెప్పిన గురువులు మీరు. వస్తాను సార్. మళ్ళీ కలుద్దాం." అంటూ లేచాడు. అప్పుడే కరెంటు వచ్చింది. లైటు వెలిగింది.

"ఉదయమ్మాయెను. స్వేచ్ఛా భారత ఉదయమ్మాయెనహో..." సూర్యకుమారి గొంతు.

"ఇదేం బోరు సార్. కొత్త పాటలు వినండి. ఈ సారొచ్చినప్పుడు కొత్త క్యాసెట్లు తెచ్చిస్తాను" అని సెలవు తీసుకున్నాడు మస్తాన్‌రెడ్డి.

స్వాతి మాసపత్రిక
నవంబర్ 2006